సాక్షి నల్లగొండ

గురువారం । 21 । నవంబర్ । 2024



యువ కానిస్టేబుళ్లు వస్తున్నారు
జిల్లాకు కేటాయించిన యువ కానిస్టేబుళ్లు త్వరలో విధుల్లో చేరనున్నారు. మేడ్చల్‌లో వీరు శిక్షణ పొందారు.
- 8లో



యువతకు ఉద్యోగావకాశాలు
నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి. ఉద్యోగావకాశాలు ఉంటాయని ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.
- 8లో



రైతాంగాన్ని ఆదుకోవాలి
ఆహార సంక్షోభాన్ని నివారించాలంటే రైతాంగాన్ని ఆదుకోవాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి, జస్టిస్ చంద్రకుమార్ అన్నారు.
- 10లో

న్యూస్‌రీల్

నల్లగొండకు మూడు లిఫ్టులు మంజూరు

నల్లగొండ: నల్లగొండ నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం మూడు కొత్త లిఫ్టులను మంజూరు చేసింది. 4,231 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో ఏర్పాటు చేయబోయే వీటి నిర్మాణానికి రూ.40 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలన ఆమోదం తెలిపింది. 510 ఎకరాలకు సాగు నీరందించేందుకు కనగల్ మండలం పానుగోడులో నిర్మించే లిఫ్టుకు రూ.6.83 కోట్లు, అలాగే 2,484 ఎకరాలకు సాగునీరు అందించేందుకు నల్లగొండ మండలం నర్సింగ్‌భట్ల ప్రాంతంలో నిర్మించే లిఫ్టుకు రూ.16.95 కోట్లు మంజూరు చేసింది. అదేవిధంగా నల్లగొండ మండలం కంచనపల్లి గ్రామ సమీపంలోని బక్కతాయికుంట వద్ద 1,237 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించనున్న లిఫ్టుకు రూ.20.22 కోట్ల మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మూసీ గురుకులం సందర్శన

కేతేపల్లి: మండలంలోని బొప్పారం శివారులో గల బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి గణేశ్ మంగళవారం పాము కాటుకు గురికావడంతో బుధవారం సాయంత్ర ఆ పాఠశాలను బీసీ రెసిడెన్షియల్ స్కూల్స్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మద్దిలేటి, ఏజీఓ లక్ష్మయ్య సందర్శించారు. సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం పాఠశాల, వసతి గృహంలో సౌకర్యాలను పరిశీలించారు. అంతకు ముందు పాము కాటుకు గురై నకిరేకల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి గణేశ్‌ను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్‌సీఓ సంధ్య, పాఠశాల ప్రిన్సిపాల్ ధనమ్మ తదితరులు ఉన్నారు.

హామీలు అమలు చేయాలి



దీక్షలో పాల్గొన్న వికలాంగులు

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు కోరారు. నల్లగొండ కలెక్టరేట్ ఎదుట వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లలో 5 శాతం వికలాంగులకు ఇవ్వాలని, స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న జరిగే వికలాంగుల మహాగర్జన సభను విజయవంతం చేయాలని వికలాంగులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్త వెంకన్నయాదవ్, ఎం.డి.ఫరూక్, సైదులు, శ్రీరామదాసు వెంకటాచారి, అహ్మద్ ఖాన్, పెరిక శ్రీనివాస్, ముద్దం నర్సింహగౌడ్, ఇందిర, చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమన్న

నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, ఏఐటీయుసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు ఎండీ. మోహినొద్దీన్, కె.నర్సింహారెడ్డి, పాశం నరేష్‌రెడ్డి, సుంకిశాల వెంకన్న, సహదేవ్ పాల్గొన్నారు.

మాదిగలకు హోంమంత్రి పదవి ఇవ్వాలి

నల్లగొండ టౌన్: మాదిగలకు హోంమంత్రి పదవి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండలో జరిగిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2025 జనవరి 26లోపు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు నారపాక అంజి, ఏర్పుల రాకేష్, బొంగరాల రంజిత్, మామిడి రాహుల్, భూతం సాయి కిరణ్, కటికల కళ్యాణ్, కటికల రవీందర్, నవీన్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సుకు హాజరైన మెడికల్ విద్యార్థులు



మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: ర్యాగింగ్ అనే విష సంస్కృతికి విద్యార్థులు దూరంగా ఉండాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే ప్రొహిబిషన్ ర్యాగింగ్ యాక్ట్ 1997 చట్టం ప్రకారం ఒకసారి కేసు నమోదైతే ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. ర్యాగింగ్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి, వైస్ ప్రిన్సిపాల్ రామచంద్ర, రాధాకృష్ణ, డాక్టర్ శివకుమార్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 56 మంది గ్రూప్-4 ఉద్యోగులు

- జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపికైన వారిని కేటాయించిన ప్రభుత్వం
- కలెక్టరేట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి
- వారందరికీ రెవెన్యూ శాఖలో పోస్టింగ్



గ్రూప్-4కు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ: గ్రూప్–4 పరీక్ష ద్వారా జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపికైన అభ్యర్థులన పూర్తయింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2022 డిసెంబర్‌లో గ్రూప్–4 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 జులై 1న రాత పరీక్ష నిర్వహించారు. 2024 ఫిబ్రవరిన ర్యాంకుల జాబితాను ప్రకటించిన ప్రభుత్వం వారం రోజుల క్రితం ఎంపికైన వారి జాబితాను విడుదల చేసింది. అయితే జిల్లాకు 56 మందిని కేటాయించింది. వారంతా రెవెన్యూ శాఖకే అలాట్ చేయడంతో వారు బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. కాగా అభ్యర్థుల సర్టిఫికెట్లను డీఆర్‌ఓ అమరేందర్, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, సిబ్బంది ఆధ్వర్యంలో పరిశీలించారు.

నేడో, రేపో పోస్టింగ్ ఉత్తర్వులు

గ్రూప్–4 ద్వారా ఎంపికై జూనియర్ అసిస్టెంట్లుగా నియమితులైన వారికి ఒకటి, రెండు రోజుల్లో పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే నల్లగొండ జిల్లాలో 33 మండలాలున్నాయి. 56 మంది జూనియర్ అసిస్టెంట్లను అలాట్ చేశారు. ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్లు రెవెన్యూశాఖకు వస్తుండడంతో ఆ శాఖలో ఉద్యోగుల సంఖ్య పెరగనుంది. దీంతో ఉన్న ఉద్యోగులపై పని భారం తగ్గడంతో పాటు రెవెన్యూలో పనులు వేగంగా జరిగే అవకాశం ఉంది.

గృహజ్యోతి కొందరికే!

- ఆన్‌లైన్ నమోదులో తప్పులు
- అర్హత కోల్పోయిన వేలాది దరఖాస్తులు
- కార్యాలయాల చుట్టూ పేదల ప్రదక్షిణలు
- మా చేతుల్లో లేదంటున్న అధికారులు



నల్లగొండలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు (ఫైల్)

గృహ కనెక్షన్లు	గృహజ్యోతికి అర్హత పొందినవి
4.88 లక్షలు	2.05 లక్షలు
అర్హత ఉండి పథకం వర్తించనివి	**పరిశీలించని కొత్త దరఖాస్తులు**
1.07 లక్షలు	1,00,000

నల్లగొండ, నల్లగొండ టూటౌన్: గృహజ్యోతి పథకం అర్హులైన వారిరందరికీ అందడం లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పదకొండు నెలలు దాటినా పథకం కింద అర్హులకు ఉచిత విద్యుత్ వర్తింపజేయడంలో యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే 200 యూనిట్ల లోపు వాడుకునే వారందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజా పాలన కార్యక్రమం కింద దరఖాస్తులు స్వీకరించింది.

సగం మందికే..

జిల్లాలో మొత్తం 4,88,302 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 2,05,013 మందికి మాత్రమే ఉచిత విద్యుత్ అర్హత లభించింది. అయితే అద్దె ఇళ్లలో ఉండే వారికి ఓనర్లు సహకరించకపోవడతో మొదటిసారి దరఖాస్తు చేసుకోలేదు. ఇంటి ఓనర్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత యజమానులు, కిరాయిదారులు కూడా ఉచిత విద్యుత్‌కు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో దాదాపు లక్షా 7 వేల మందికి అన్ని అర్హతలు ఉండి కూడా గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ అందడం లేదు. ఒక్క నల్లగొండ పట్టణంలోనే 1,500పైగా దరఖాస్తుదారులు అన్ని అర్హతలు ఉన్నా ఉచిత విద్యుత్ అందని పరిస్థితి నెలకొంది. దీనికితోడు జిల్లా వ్యాప్తంగా మరో లక్ష మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నా వాటిని ఇంకా పరిశీలించడం లేదు.

ఆన్‌లైన్‌లో అన్నీ తప్పులే..

ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్ చేయించింది. ఒక్కో దరఖాస్తు ఫారం ఆన్‌లైన్ చేసినందుకు రూ.15 ఇచ్చింది. ఈ క్రమంలో ఎక్కువ ఫారాలు ఆన్‌లైన్ చేస్తే ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో కంప్యూటర్ ఆపరేటర్లు హడావుడిగా ప్రక్రియను కొనసాగించారు. దీంతో తప్పులు ఎక్కువగా దొర్లాయి. ఇంటి అడ్రస్‌తోపాటు ఆధార్ నంబర్లు, కొంత మందికి అసలు కరెంట్ మీటర్ లేదని కూడా నమోదు చేశారు. కొంత మందివైతే వేరే మండలాల పేర్లు కూడా నమోదు చేశారు. ఇలాంటి కారణాలతో అనేక మందికి గృహజ్యోతి పథకం అందకుండా పోయింది. పథకం అందని వారు మున్సిపల్, ట్రాన్స్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సైట్‌లో కూడా తప్పులు సరిచేసేందుకు ఆప్షన్ ఇచ్చి తమకు కూడా గృహజ్యోతి అందేలా చూడాలని అర్హులైన పేదలు కోరుతున్నారు.

ఉచిత కరెంట్ అందడంలేదు



ప్రజా పాలనలో దరఖాస్తు చేశాను. గృహజ్యోతికి అర్హత కూడా సాధించాను. కానీ కరెంట్ మీటర్ నంబర్ ఆన్‌లైన్ తీసుకోవడంలేదని అధికారులు చెబుతున్నారు. 11 నెలలుగా మున్సిపల్, ట్రాన్స్‌కో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమ చేతుల్లో లేదని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా ఉచిత కరెంట్ అందడం లేదు.

– జి.భగవాన్, గాంధీనగర్, నల్లగొండ

తప్పులను సరిచేయాలి



గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నా. ఉచిత కరెంట్ అందకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశాను. కానీ ఇప్పటి వరకు మాకు గృహజ్యోతి అందడంలేదు. ప్రభుత్వం సైట్ ఓపెన్ చేసి తప్పులు ఉంటే సరిచేయాలి. అర్హులైన పేదలందరికీ ఉచిత కరెంట్ అందించాలి.

– గుండా రమేష్, శ్రీరాంనగర్, పాగనల్ రోడ్డు, నల్లగొండ

రేవంత్‌రెడ్డిది విధ్వంస పాలన

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి



మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన పేరుతో విధ్వంస పాలన కొనసాగిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అలవి కానీ హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డిని రాజకీయంగా బొంద పెట్టేందుకు తెలంగాణ సమాజం ఎదురు చూస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో సమైక్యాంధ్ర కోసం పోరాడిన రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రధాని మోదీని విమర్శించే స్థాయి సీఎంకు లేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, పోతెపాక సాంబయ్య, మిర్యాల వెంకటేశం, రావెళ్ల కాశమ్మ, వంగూరి రాఖీ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త ప్రాజెక్టులు రూపొందించాలి

- డీఈఓ భిక్షపతి



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ: ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించేలా వ్యర్థ పదార్థాలు, వస్తువులతో సరికొత్తగా ప్రాజెక్టులు రూపొందించేలా విద్యార్థులకు చేయూతనివ్వాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. కేంద్ర పర్యావరణ, అడవుల మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ, జాతీయ హరిత దళాలు హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ డైట్‌లో ఏర్పాటు చేసిన వేస్ట్ టు హెల్త్ ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా తిప్పర్తి కేజీబీవీ పాఠశాలకు ప్రథమ బహుమతి రూ.3 వేలు, చందంపేట కేజీబీవీ ద్వితీయ రూ.2 వేలు, జెడ్పీహెచ్‌ఎస్ కేశరాజుపల్లికి తృతీయ బహుమతిగా రూ.వెయ్యి, ప్రోత్సాహక బహుమతుల కింద రామగిరి బాలికల ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్‌ఎం దోరేపల్లికి రూ.500 చొప్పున నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ హరిత దళాల రాష్ట్ర కోఆర్డినేటర్ ఎం.రాజశేఖర్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రామచంద్రయ్య, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి, పర్యావరణ ప్రేమికుడు సురేష్‌గుప్త, రామనర్సయ్య, నర్సింహ, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ: రైతులకు ఎరువుల డీలర్లు, ఫర్టిలైజర్ దుకాణాదారులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అమ్మాలని డీఏఓ శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం మిర్యాలగూడలోని రైతువేదికలో విత్తన డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రశీదు ఇచ్చి రశీదుపై రైతుల సంతకాలు తీసుకోవాలన్నారు. రైతులు రశీదులను పంట పండించేంతవరకు భద్రపరుచుకోవాలని, విత్తనాలు, రైతులు నాసిరకమైతే సంబంధిత వ్యాపారిపై చర్యలు తీసుకునేందుకు వీలుంటుందన్నారు. జిల్లాలో వచ్చే యాసంగి సీజన్‌లో 5.25లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతుందని అంచనా ఉందన్నారు. జిల్లాలో 26,700 మెట్రిక్ టన్నుల యూరియా, 1700 మెట్రిక్ టన్నుల డీఏపీ, 2300 మెట్రిక్ టన్నుల పొటాష్, 1400 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 1700 మెట్రిక్ టన్నుల సూపర్ ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని పేర్కొన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాదారుల వద్దనే ఎరువులను, విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. రైతులు వరికొయ్యలను తగలబెట్టడం వల్ల నేలలో పోషకాలు తగ్గుతాయన్నారు. సమావేశంలో ఏడీఏ దేశ్‌సిం, ఏఓలు సైదానాయక్, రుషేంద్రమణి, సరిత, శివరాంకుమార్, ఉమారాణి ఉన్నారు.

ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, చిత్రంలో అధికారులు, మిల్లర్లు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: రైస్ మిల్లర్లు రైతుల నుంచి కొనుగోలు చేసిన సన్న ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో 2023–24 వానాకాలం, యాసంగి సీఎంఆర్ పెండింగ్, ఈ వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలాఖరులోపు పెండింగ్ సీఎంఆర్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్లు రోజూ మిల్లులను సందర్శించి మిల్లర్లు త్వరగా సీఎంఆర్ చెల్లించే విధంగా చూడాలన్నారు. మిల్లర్లు.. ధాన్యం కొన్న రైతుల వివరాలను ఫారం–బీ రిజిస్టర్‌లో, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొన్నదైతే రిజిస్టర్–ఏ2లో నమోదు చేయాలన్నారు. ఈ వానాకాలానికి సంబంధించిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని, సన్న, దొడ్డు ధాన్యాలను వేరువేరుగా నిలువ చేయాలన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ హరీష్, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నారాయణ, మిల్లర్ల సంఘం మిర్యాలగూడ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



కేతేపల్లి : మూసీ గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేతేపల్లి: ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో శానిటేషన్ నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. కేతేపల్లి మండలం బొప్పారం శివారులో మూసీ డ్యాం దిగువన గల బీసీ బాలుర గురుకులంలో మంగళవారం ఓ విద్యార్థి పాము కాటుకు గురైన నేపథ్యంలో బుధవారం కలెక్టర్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానపు, వంట గదులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆవరణలోనే మురుగు నీరు పారడం, పిచ్చి మొక్కలు, చెత్త ఎక్కువగా ఉండడాన్ని గమనించి ప్రిన్సిపాల్ ధనమ్మ, పారిశుద్ధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయంత్రంలోగా ఆవరణను శుభ్రం చేయాలన్నారు. శిథిల గదులు, మరుగుదొడ్లతోపాటు ప్రస్తుతం విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. కొత్తవారి నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేస్తానని చెప్పారు. పాఠశాల ఆవరణలో ఉన్న మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన ఇనుప సామగ్రిని తొలగించాలని మూసీ ఏఈ మధును ఆదేశించారు. పాఠశాల స్థలానికి హద్దులు నిర్ణయించాలని సూచించారు. పాఠశాలలో పరిస్థితులు ఇంత అధ్వానంగా ఉన్నా తనకు ఎందుకు నివేదిక పంపించలేదని, విద్యార్థులకు ప్రమాదం జరిగేంత వరకు స్పందించరా అని ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ రాజేంద్రప్రసాద్‌ను ప్రశ్నించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారం రోజుల తర్వాత పాఠశాలను మరోసారి సందర్శిస్తానని, మార్పు రాకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆమె వెంట బీసీ వెల్ఫేర్ రీజినల్ కోఆర్డినేటర్ సంధ్య, తహసీల్దార్ బి.మధుసూధన్ రెడ్డి, కార్యదర్శి హరీష్ ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



నకిరేకల్ ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్: ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. నకిరేకల్‌లోని ఏరియా ఆసుపత్రిని బుధవారం ఆమె సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. మూసీ గురుకులంలో పాముకాటుకు గురై ఇదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి గణేష్‌ను పరామర్శించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల వైద్యశాల భవనం సముదాయాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆమె వెంట తహసీల్దార్ జమీరుద్దీన్, డాక్టర్లు ఉన్నారు.

22న ప్రజా పాలన విజయోత్సవాలు

నల్లగొండ: నల్లగొండలోని ఎన్జీ కాలేజీ మైదానంలో ఈ నెల 22న ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా తలపెట్టిన జిల్లా స్థాయి సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లపై బుధవారం నల్లగొండలోని తన చాంబర్‌లో జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఈ నెల 23న తలపెట్టిన కార్యక్రమాలను అనివార్య కారణాల వల్ల ముందస్తుగానే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు రానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్‌ఓ అమరేందర్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ త్రిపాఠి

సర్వే వివరాలు గోప్యంగా ఉంచాలి

సమగ్ర ఇంటింటి సర్వేలో సేకరించిన కుటుంబాల వివరాలను గోప్యంగా ఉంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు సర్వే వివరాలను బయటకు వెల్లడిస్తే సీఆర్‌పీసీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, ఈడీఎం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

బొమ్మలరామారం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బొమ్మలరామారం మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం రుస్తాపూర్ గ్రామానికి చెందిన జిన్న మల్లేష్(45) హైదరాబాద్ జవహర్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మల్లేష్‌కు స్వగ్రామంలో పని ఉండడంతో తన టీవీఎస్ ఎక్స్ఎల్ వాహనంపై బొమ్మలరామారం వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో బొమ్మలరామారం శివారులో వెనుక వైపు నుంచి వచ్చిన కారు మల్లేష్ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీశైలం తెలిపారు. మృతుడు జిన్న మల్లేష్ మత్స్య కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడని, గ్రామాల్లో తిరిగి చేపలు విక్రయించి స్వగ్రామానికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మర్యాల మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు ప్యారారం రాములు కోరారు.

పత్తి కూలీల ఆటో బోల్తా

- కూలీలకు తీవ్ర గాయాలు



గాయపడిన కూలీలు

నాంపల్లి: పత్తి కూలీల ఆటో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నాంపల్లి మండలంలోని గట్లమల్లేపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. బుధవారం గుడిపల్లి మండలంలోని ఘనపురం గ్రామానికి చెందిన 15మంది కూలీలు ఆటోలో నాంపల్లికి పత్తి తీయడానికి వచ్చారు. పని ముగించుకొని తిరుగు ప్రయాణమవ్వగా.. గట్లమల్లేపల్లి గ్రామ శివారులో మూలమలుపు వద్ద ఆటో బోల్తాపడింది. దీంతో ఐదుగురు కూలీలకు తీవ్రగాయాలుకాగా.. 10మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్కూటీని ఢీకొన్న లారీ.. బాలుడికి గాయాలు

మేళ్లచెరువు: స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో బాలుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మేళ్లచెరువు మండల కేంద్రంలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి మల్లారెడ్డిగూడెం వైపు వెళ్తున్న లారీ మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీ కొట్టింది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న రాచమడుగు మల్లికార్జున్, కుమారుడు రోహిత్, చంద్రశేఖర్ రావులు రోడ్డుపై పడిపోయారు. వీరిలో రోహిత్(8)కు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

త్రిపురారం: రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం కుప్పలకు బైక్ తగలడంతో అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన త్రిపురారం మండలంలోని కుంకుడుచెట్టు తండా గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలంలోని తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పు తండాకు చెందిన నాగు తన ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తితో కలిసి అడవిదేవులపల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా.. త్రిపురారం మండలంలోని కుంకుడుచెట్టు తండా గ్రామ పంచాయతీ పరిధిలోని రాగానే రోడ్డుపై ఉన్న వరి కుప్పలకు బైక్ తగిలి కింద పడ్డారు. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు.. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. కాగా. రోడ్డుపై ధాన్యం కారణంగా ఇదే ప్రాంతంలో గతంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. రోడ్డుపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

యువ కానిస్టేబుళ్లు వస్తున్నారు

- నేడు శిక్షణ కానిస్టేబుళ్లకు పాసింగ్ అవుట్ పరేడ్
- జిల్లాకు రానున్న 291 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 105 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు
- పెరుగనున్న మహిళా పోలీసుల సంఖ్య



పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో కవాతు నిర్వహిస్తున్న శిక్షణ కానిస్టేబుళ్లు

నల్లగొండ క్రైం: జిల్లాకు కొత్తగా 396 మంది యువ పోలీసులు రానున్నారు. జిల్లాకు కేటాయించిన కానిస్టేబుల్ అభ్యర్థులకు మేడ్చల్ శిక్షణ కేంద్రంలో ట్రైనింగ్ ముగిసింది. తొమ్మిది నెలల పాటు శిక్షణ పొందిన యువ కానిస్టేబుళ్లకు గురువారం పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించనున్నారు. అనంతరం ఉత్తర్వులు తీసుకుని ఆయా పోలీస్ స్టేషన్లలో విధుల్లో చేరనున్నారు. కొత్త ఆశయాలు, ఆకాంక్షలతోపాటు ప్రజలకు రక్షణ కల్పించే ధ్యేయంతో విధుల్లో చేరుతున్న నూతన కానిస్టేబుళ్లలో ఉత్సాహం నెలకొంది.

తొమ్మిది నెలలపాటు శిక్షణ

తొమ్మిది నెలల శిక్షణ కాలంలో కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రజలకు రక్షణ కల్పించే విషయంతో పాటు సైబర్ నేరాల బారిన పడకుండా సంఘ విద్రోహ శక్తులను అణిచివేసే క్రమంలో తీసుకోవాల్సిన మెళకువలు నేర్పించారు. నల్లగొండ జిల్లాకు 396 మంది రానుండగా.. సివిల్ కానిస్టేబుళ్లు 291 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 192 మంది, మహిళలు 99 మంది మొత్తం 291 మంది ఉన్నారు. అదే విధంగా ఏఆర్ కానిస్టేబుళ్లు 105 మంది ఉండగా.. పురుషులు 86 మంది, మహిళలు 19 మంది ఉన్నారు. ఇప్పటికే జిల్లాలో 452 మంది విధులు నిర్వహిస్తుండగా 44 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు.

ప్రజారక్షణ కోసమే పోలీస్ ఉద్యోగంలో చేరా



ప్రజలకు రక్షణ కల్పించేందుకే పోలీసు ఉద్యోగంలో చేరా. పేదలకు సహాయం చేయడం, రక్షణ కల్పించడం పోలీసు శాఖ ద్వారానే సాధ్యం. మహిళల సంఖ్య అన్ని రంగాల్లో పెరుగుతుంది. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా తన విధి నిర్వహణలో పేదలకు పోలీసు శాఖపై భరోసా కలిగేలా కృషి చేస్తా.

– మౌనిక, తెట్టికుంట

చాలా సంతోషంగా ఉంది



పోలీసు ఉద్యోగంలో చేరడం చాలా సంతోషంగా ఉంది. పేదలకు అన్యాయం జరిగితే మొదటగా పోలీసులను ఆశ్రయిస్తారు. ఎలాంటి అండ లేని వారికి పోలీసు శాఖ ద్వారానే న్యాయం జరుగుతుంది. అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ప్రజారక్షణకు కృషి చేస్తా.

– సతీష్, కేతేపల్లి

క్యాంపస్ సమాచారం

ఎంజీయూ డిగ్రీ పరీక్షలు వాయిదా

నల్లగొండ రూరల్: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు సీఈఓ ఉపేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా వేసిన పరీక్షలను డిసెంబర్ 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదవ సెమిస్టర్ పరీక్షలను మధ్యాహ్నం సమయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు

యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు

- ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



ఉద్యోగ మేళాకు హాజరైన అభ్యర్థులు



మాట్లాడుతున్న వీసీ

నల్లగొండ రూరల్: నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉంటాయని ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. బుధవారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. యువతకు నైపుణ్యాలు, సామాజిక అంశాల సునిశిత పరిశీలన స్పృహ కలిగిన వారికి అనేక అవకాశాలు ఉంటాయన్నారు. ప్రైవేట్ సంస్థలు నిర్వహించిన ఉద్యోగ మేళాకు 600 మంది అభ్యర్థులు హాజరు కాగా 250 మందికి ఉద్యోగాలు లభించనున్నాయని ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఉద్యోగ మేళాలో కాగ్నిజెంట్ టెక్ మహీంద్ర, విప్రో ఇన్ఫోసిస్, రేడియంట్, హెటిరో డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సందీప్, హిమబిందు, చందర్ పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన భోజనం అందించాలి

విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఎంజీయూలో హాస్టల్ కార్యదర్శులు, డైరెక్టర్, వార్డెన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను యూనివర్సిటీలోనే ఉంటున్నందున హాస్టళ్లను స్వయంగా పర్యవేక్షిస్తానన్నారు. ఎలాంటి ఇబ్బందులు జరగకుండా విద్యార్థుల భాగస్వామ్యంతో నూతన విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. 75 శాతం హాజరు నిబంధనలు పాటించాలని విద్యార్థులకు తెలియజేయాలన్నారు. తరగతులకు వస్తేనే విజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, హాస్టల్స్ డైరెక్టర్ దోమల రమేష్, వార్డెన్లు నీలకంఠం శేఖర్, ఆనంద్, ఆదిరెడ్డి, నవీన్, లోకేష్ పాల్గొన్నారు.

ఎన్జీ కాలేజీలో 25న పీజీ స్పాట్ కౌన్సెలింగ్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎన్జీ కళాశాలలో ఈ నెల 25న పీజీ స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్ బుధవారం తెలిపారు. పీజీ సెట్ 2024 రాసిన వారు, రాయని వారు అందరూ అర్హులేనని పేర్కొన్నారు. డిగ్రీ 55 శాతం మార్కులు తప్పనిసరి తెలిపారు. అడ్మిషన్ పొందిన వారు ఎంఏ తెలుగు, ఎకనామిక్స్ రూ.25,400, ఎంకామ్ రూ.29,400, ఎంఎస్సీ జువాలజీ, కెమిస్ట్రీ రూ.34,700, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ రూ.39,700 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు, రెండు సెట్ల జీరాక్స్ కాపీలు తీసుకురావాలని కోరారు.

వైన్ షాపుల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- రూ.లక్షా 85వేలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ధనుంజయ్య

కొండమల్లేపల్లి: వైన్ షాపుల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, అతడి నుంచి రూ.1.85లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య బుధవారం తన కార్యాలయంలో వెల్లడించారు. గుర్రంపోడు మండల కేంద్రంలో గత నెల 12న ఆదిత్య వైన్ షాపులో రూ.10లక్షల నగదు అపహరణకు గురైంది. వైన్స్ యజమాని నరసింహరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్రంపోడు పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లగొండ సీసీఎస్ పోలీసులు, కొండమల్లేపల్లి సీఐ దర్యాప్తు దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్య, గుర్రంపోడు ఎస్‌ఐ మధు, కానిస్టేబుల్ సత్యనారాయణ, కిరణ్ బాబు, దశరథలు నిందితుడైన బిస్తు రమేష్‌ను ఈనెల 20న కొండమల్లేపల్లి బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకొని విచారించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 వైన్ షాపుల్లో దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. బిస్తు రమేష్ నుంచి రూ.1.85లక్షలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసును ఛేదించడంలో భాగస్వాములైన నల్లగొండ జిల్లా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సోమ నరసయ్య, సిబ్బంది, కొండమల్లేపల్లి సీఐ, గుర్రంపోడు పోలీసులను ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

ముగిసిన నెట్‌బాల్ ఎంపిక పోటీలు



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విమల

పెద్దవూర: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 విభాగాల నెట్‌బాల్ ఎంపిక పోటీలు ముగిశాయి. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్-14 విభాగంలో 12 మంది బాలురు, 12 మంది బాలికలు, అండర్-17 విభాగంలో 12 మంది బాలికలు, 12 బాలురు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ విమల తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23, 24, 25 తేదీల్లో మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడెం డివిజన్ సెక్రటరీ వెంకట్రామిరెడ్డి, సెయింట్ జోసెఫ్ స్కూల్ హెచ్‌ఎం సిస్టర్ లలిత, క్లారా, పీఈటీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట): ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి జారిపడి వ్యక్తికి గాయాలైన సంఘటన ఆత్మకూర్ మండల పరిధిలోని మత్తకొత్తగూడెం గ్రామంలో బుధవారం చోటుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చామకూరి పెద్ద ఉప్పలయ్య రోజు మాదిరిగా బుధవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారి చెట్టు పైనుంచి కింద పడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల గ్రామంలో విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాచర్ల లింగమ్మ(70) మంగళవారం రాత్రి తన ఇంట్లో నీటిసంపు వద్ద బట్టలు ఉతుకుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ మోటార్ వైరు చేతికి తగిలింది. దీంతో విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శివతేజ బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

- తన చావుకు ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్
- ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కన కుళ్లినస్థితిలో మృతదేహం
- మృతుడు నకిరేకల్ మండలం గోరెంకలపల్లి వాసిగా గుర్తింపు

ఇబ్రహీంపట్నం రూరల్: 'నా చావుకు ఎవరూ కారణం కాదు.. కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నా' అని సూసైడ్ లేఖ రాసిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కన చెట్టుకు ఉరివేసుకొని కుళ్లిన స్థితిలో ఓ మృతదేహాన్ని గమనించిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్‌ఐ బాలరాజు వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏడెనిమిది రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. చుట్టు పక్కల వెతికినా ఎలాంటి ఆధారాలూ లభించలేదు. మృతుడి ప్యాంట్ జేబులో వెతకగా బీడీలు, అగ్గిపెట్టెతో పాటు ఒక కవర్‌లో లేఖను గుర్తించారు. తన చావుకు తీవ్రమైన కడుపునొప్పి కారణమని అందులో రాసి ఉంది. పక్కనే కుమార్తె ఉమ సెల్‌ఫోన్ నంబరు కూడా ఉండటంతో పోలీసులు సమాచారం ఇచ్చారు. వివరాలు ఆరా తీయగా.. మృతుడు నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం గోరెంకలపల్లి గ్రామానికి చెందిన పోల్‌రెడ్డి సుదర్శన్‌రెడ్డి(56)గా గుర్తించారు. నల్లమల్ల అపార్ట్‌మెంట్ ప్రముఖ్ టౌన్‌షిప్‌లో తన బిడ్డ వద్ద ఉండేవాడని తెలుసుకున్నారు. బోర్‌వెల్‌పై పనిచేస్తూ పది రోజులకోసారి ఇంటికి వచ్చేవాడని తెలిపారు. వారం క్రితమే ఇంటి నుంచి వెళ్లినట్లు చెప్పారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

అడవిదేవులపల్లి : మండల కేంద్రానికి చెందిన నక్క గురువమ్మ, సయ్యద్‌పాష ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. వారు పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా లొకేషన్ ట్రేస్ చేసి ఒకటి దాచేపల్లి, మరొకటి హైదరాబాద్‌లో ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకుని బుధవారం బాధితులకు అందజేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురికి 6 నెలల జైలు

రామగిరి(నల్లగొండ): రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఎస్సీ ఎస్టీ సెషన్స్ కోర్టు జడ్జి రోజారమణి బుధవారం తీర్పు వెలువరించారు. మునుగోడు మండల కేంద్రానికి ఆనుకోని ఉన్న పెద్ద చెరువులో సింగారం గ్రామానికి చెందిన కొంత మంది అక్రమంగా బోర్లు వేశారని 2017లో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు తహసీల్దార్, వీఆర్‌ఓ మహేశ్వర్ వెంకటయ్యలు చెరువును పరిశీలించేందుకు వెళ్లారు. సింగారం గ్రామానికి చెందిన కుంభం వెంకట్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, సుజాత, వాణిలు వీఆర్‌ఓ వెంకటయ్యను కులం పేరుతో దూషించారు. తహసీల్దార్ వెంకటయ్యపై దాడి చేశారు. దీంతో వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి ఎస్సై రాములు కేసు నమోదు చేయగా డీఎస్పీ సుధాకర్ చార్జీషీటు వేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలతో ఏకీభవించిన ఎస్సీ ఎస్టీ సెషన్స్ కోర్టు జడ్జి రోజారమణి.. అధికారుల విధులకు ఆటకం కలిగించి, కులం పేరుతో దూషించి, దాడి చేసిన ఐదుగురికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.7500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు.

230 బస్తాల రేషన్‌బియ్యం పట్టివేత

నల్లగొండ క్రైం: నల్లగొండ రూరల్, కనగల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన 230 బస్తాల రేషన్ బియ్యాన్ని బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు బియ్యం తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆటోను సీజ్ చేశారు. బియ్యం తరలింపులో సంబంధమున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

రైతు సమస్యలు.. పరిష్కార మార్గాలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో విద్యార్థినులు, శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన వ్యవసాయ డిగ్రీ కళాశాల విద్యార్థినులు బుధవారం గరిడేపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో గ్రామీణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కార మార్గాలను గ్రామ పటం, చిత్రాల రూపంలో వివరించారు. రైతులు ఎక్కువగా ఒకే పంట పండిస్తున్నారని, దాని ద్వారా భూసారం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త కిరణ్, తహసీల్దార్ కవిత, ఎంపీడీఓ సరోజ, ఏఓ ప్రియతమ్, శాస్త్రవేత్త డి.ఆదర్శ్ పాల్గొన్నారు.

సెంట్రింగ్ సామగ్రి చోరీ చేసేందుకు యత్నం

- దొంగలను పట్టుకున్న ఇంటి యజమాని

చౌటుప్పల్: సెంట్రింగ్ సామగ్రిని చోరీ చేసేందుకు యత్నించిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులను సదరు ఇంటి యజమాని పట్టుకున్నాడు. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని కేపీఆర్ వెంచర్‌లో ఓరుగంటి భానుప్రకాష్ అనే వ్యక్తి ఇంటికి బుధవారం స్లాబ్ వేయాల్సి ఉంది. అందులో భాగంగా పనులను పర్యవేక్షించేందుకు భానుప్రకాష్ తంగడపల్లి గ్రామానికి చెందిన పులకరం కుమార్‌తో కలిసి నిర్మాణంలో ఉన్న ఇంటి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ముగ్గురు వ్యక్తులు హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన ఎండీ ఇబ్రహీం(37), ఎండీ ఆసిఫ్‌అలీ(20), కూకట్‌పల్లిలోని ఐడీపీఎల్ గాంధీనగర్‌కు చెందిన యాత బాబు(50) ఆ ఇంటి వద్ద ఉన్న సెంట్రింగ్ సామగ్రిని అపహరించేందుకు గాను ఆటోలో వేసుకున్నారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న ఇంటి యజమాని వారిని పట్టుకునే ప్రయత్నించగా.. ఎండీ ఇబ్రహీం, ఎండీ ఆసిఫ్ అలీ పట్టుబడ్డారు. యాత బాబు అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

కందిలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

- రసాయన పురుగు మందులను విచక్షణా రహితంగా వాడకూడదు.
- సస్యరక్షణ చర్యలు తగిన సమయంలో చేపట్టకపోతే.. పురుగు ఉధృతిని బట్టి పైరు మొగ్గ లేదా తొలి పూత దశలో ఉన్నప్పుడు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ, పూత లేదా కాయ దశలో క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి హ్యాండ్ కంప్రెషర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయాలి.



నడిగూడెం మండల కేంద్రంలో పూత దశలో ఉన్న కంది

పాడిపంట

నడిగూడెం : ప్రస్తుతం కంది పంట పూత, పిందె దశ ఆరంభమైంది. ఈ సమయంలో ఇప్పటి నుంచే పలు రకాల పురుగులు ఆశించి నష్టపరుస్తుంటాయి. ఇందుకుగాను రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు పాటించాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ తెలిపారు. కంది పంట సాగులో పాటించాల్సిన మెళకువలు ఆయన మాటల్లోనే..

ఆశించే పురుగులు, నివారణ చర్యలు..

ఆకుచుట్టు పురుగు : కంది చేను పెరిగే దశలో ఆకుచుట్టు పురుగు ఆశిస్తుంది. ఆకులను, పూతను చుట్టగా చుట్టుకొని లోపల నుంచి గీరి తింటుంది. దీని ఉధృతి ఎక్కువగా ఉంటే మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాయతొలుచు పురుగు: ఈ పురుగు పూత, పిందె దశలో కాయలకు రంధ్రాలు చేసి తింటుంది. ఒక కాయ నుంచి మరో కాయకు ఆశిస్తుంది.

మారూక మచ్చల పురుగు : దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేదా థయోడికార్బ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మందులను మార్చి వారం రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి.

కాయ ఈగ : కాయ ఈగ ఆశించినప్పుడు నష్టం కనిపించదు. దీనివల్ల పురుగు కాయ లోపలే ఉండి గింజలను తినేస్తుంది. ఈ పురుగు అన్ని దశలనూ కాయలోపలే పూర్తి చేసుకొని తల్లి పురుగు మాత్రమే బయటకు వస్తుంది. తల్లి పురుగు లేత పిందె దశలో కాయలపై గుడ్లు పెడుతుంది. కావున పిందె దశలో 5 శాతం వేప గింజల కషాయం పిచికారీ చేస్తే గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. గింజ గట్టిపడే దశలో డైమిథోయేట్ 2.0 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నివారణ చర్యలు :

ఈ పురుగు తక్కువగా ఆశించే పంటలైన జొన్న, సోయా చిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మెట్ట వరి మొదలైన పంటలతో పంట మార్పిడి చేయాలి.

- ఖరీఫ్‌లో అంతర పంటగా 7 సాళ్లు, రబీలో 3 సాళ్లు పెసర, మినుము, వేయడం ద్వారా పరాన్న జీవులను వృద్ధి చేయడానికి తోడ్పడతాయి. పొలం చుట్టూ 4 సాళ్లు జొన్న రక్షిత పైరుగా విత్తాలి.
- పచ్చ పురుగును తట్టుకునే ఎల్.ఆర్.జి. 41 రకాన్ని సాగు చేయాలి.
- పైరు విత్తిన 90–100 రోజుల్లో చిగుళ్లపై ఒక అడుగు మేరకు కత్తిరించాలి.
- ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు అమర్చి పురుగు ఉనికిని గమనించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- పురుగులను తినే పక్షులను ఆకర్షించడానికి వీలుగా ఎకరానికి 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.
- పురుగు గుడ్లను, తొలి దశ పురుగులను గమనించి వెంటనే 5 శాతం వేప గింజల కషాయాన్ని లేదా వేప సంబంధిత మందును 200 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల తేడాతో రెండు సార్లు సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి.
- బాగా ఎదిగిన పురుగులను ఏరివేయాలి. లేదా చెట్లను బాగా కుదిపి దుప్పట్లలో పడిన పురుగులను నాశనం చేయాలి.